క్లుప్తంగా

పల్లకీలో విహరించిన మహానందీశుడు



పల్లకీసేవ పాల్గొన్న భక్తులు

మహానంది: మహానందిలో కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు బెక్కెం శరభయ్యలు ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకరించి గణపతిపూజ, గోమాతకు పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పల్లకీసేవను వీక్షించారు. పల్లకీని మోస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అలరించిన వీణనాదం



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై కాలిఫోర్నియాకు చెందిన సానిక పాండే (ఎన్.ఆర్.ఐ)వారి వీణనాదం కార్యక్రమం అలరించింది. గణపతి ప్రార్థన, ఓం నమఃశివాయ, శివశివ శంకరా, శివాష్టకం, శివస్తోత్రం మొదలైన పలు గీతాలు, అష్టకాలు మొదలైన వాటిని ఆలపించారు. వీణ సానిక పాండే, మృదంగం బాల సుబ్రహ్మణియన్, వయోలిన్ వాసు విశ్వనాథ్ అందించారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామంలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఆవిష్కరించారు. పీఆర్టీయూ స్టేట్ కౌన్సిలర్ జాకీర్‌హుసేన్ మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందుంటుందన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు తమకు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్‌లను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్

ఆత్మకూరు: ఈనెల 10న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6303244165, 7673902328 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



కొత్తపల్లి సమీపంలో పనులు చేస్తున్న ఉపాధికూలీలు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల, ఎదురుపాడు, శివపురం, ఎర్రమఠం, ముసలిమడుగు గ్రామాలతో పాటు మండల కేంద్రం కొత్తపల్లిలో అధికారులు ఉపాధి పనులు ప్రారంభించారు. ఉపాధి పనులు లేక ×పల్లెలు ఖాళీ అవుతున్నాయ్₹ శీర్షిక సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి సోమవారం పనులు ప్రారంభించారు. ఏపీఓ హరికృష్ణ పర్యవేక్షణలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలకు పనులు కల్పించారు. రోజుకు 1,000 మంది వేతనదారులకు పనులు కల్పించాల్సి ఉండగా సోమవారం 505 మందికి ఉపాధి పనులు కల్పించినట్లు ఏపీఓ తెలిపారు.

15 వరకు పొడిగింపు

బండి ఆత్మకూరు: రబీ పంటకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రీమియం చెల్లిస్తేనే ప్రభుత్వం నుంచి వచ్చే బీమా వర్తిస్తుందన్నారు.

ఇస్తేమాకు ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు: పట్టణంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఇస్తెమాకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీగా ముస్లింలు వచ్చే అవకాశం ఉండటంతో తాగునీరు, స్నానపుగదులు, చలువ పందిళ్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసు శాఖతోపాటు రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్టీసీ, వైద్య సిబ్బంది విధుల్లో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఇస్తెమా ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

భారీ బందోబస్తు ఏర్పాటు

ఇస్తెమా సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. తొలి విడతగా సోమవారం 500 మంది పోలీసు సిబ్బంది ఆత్మకూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఐదుగురు డీఎస్పీలు, 40 మంది సీఐలు, ఇతర సిబ్బంది పోలీసు బందోబస్తులో పాల్గొన్నారన్నారు. పోలీసులు ట్రాఫిక్, మొబైల్ టీం, ఇతర ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. ఏ, బీ సెక్షన్లు ఏర్పాటు చేసి, మూడు షిఫ్ట్‌ల్లో విధులు కేటాయించామన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

మహా రథోత్సవం వైభవంగా చేద్దాం

- మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానంది క్షేత్రంలో ఫిబ్రవరి 24 నుంచి జరగనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం మహానందిలోని రథ మండపంలో ఉన్న రథాన్ని ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ ఐదు రోజుల పాటు పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. రథానికి ఏవైనా చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. రథానికి ఉన్న గొలుసు స్థానంలో తాళ్లు ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా రథోత్సవాన్ని చేసే విధి, విధానాలపై సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ప్రకటనలొద్దు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది పంచాంగం ఆహ్వానపత్రికలు, పుస్తకాల ముద్రణలో ఎలాంటి ప్రైవేట్ ప్రకటనలు లేకుండా ముద్రించాలని ఈఓ శ్రీనివాసరెడ్డి సిబ్బందికి సూచించారు. మహానంది దేవస్థానం కార్యాలయంలో సోమవారం శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు, ఉగాది పంచాంగం పుస్తకాల ముద్రణపై ముఖ్య అర్చకులు మణికంఠశర్మతో చర్చించారు. ప్రైవేటు సంస్థల ప్రకటనలు వద్దని, కేవలం దేవస్థానం, స్వామి, అమ్మవారి దృశ్యాలతో ముద్రించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అదనపు సీసీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత సిబ్బందితో సమీక్షించారు.



రథాన్ని పరిశీలిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

సెల్‌ఫోన్‌కు బానిసలు కావొద్దు

నందికొట్కూరు: సెల్‌ఫోన్‌కు విద్యార్థులు బానిసలు కావొద్దని రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని వడ్డేమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేమన శతకాల పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు కర్నూలుకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ మోటివేషన్ క్లాస్‌లు నిర్వహించారు. క్రమశిక్షణతోనే చదువుకుని అద్భుతమైన ఫలితాలు సాధించాన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జుబేదా, ఉపాధ్యాయులు రఫీఅహ్మద్, ఈశ్వరయ్య,అల్లి హుసేన్ పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- ఈఓ ఎం.శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం సున్నిపెంటలో నిర్మిస్తున్న సిబ్బంది వసతి గృహాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమ వారం దేవస్థాన సిబ్బంది వసతి గృహాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వసతి గృహాల వద్ద సీసీ రోడ్లు, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ హెచ్‌టీ యార్డు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా కోసం నిర్మాణంలో ఉన్న నీటిపంపులు, మోటార్ పనులను ఫిబ్రవరి చివరిలోపు పూర్తి చేయాలన్నారు. ఈఓ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, సుబ్బారెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.



సిబ్బంది వసతి గృహాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఓ

7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నందికొట్కూరు: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7 చి 10వ తేదీ వరకు జాభిప్రాయాలను సేకరిస్తామన్నారు. టారిఫ్ నిర్ధారణ, వార్షిక ఆదాయ అవసరాలకు గురించి సలహాలు, సూచనలు, అభ్యంతరాలుంటే తెలిపయపరచాలన్నారు. అభిప్రాయాలను భౌతికంగా గాని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ తెలియజేయాలన్నారు. 7, 8 తేదీల్లో విజయవాడలోని కన్వెన్షన్ సెంటర్, బృందావన్ కాలనీలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భౌతికంగా, 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయం జెలియజేయవచ్చన్నారు. 10న కర్నూలులో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయంలో భౌతికంగా పాల్గొనవచ్చన్నారు. ఈత్మకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలను చెప్పవచ్చన్నారు. నందికొట్కూరు డివిజన్ పరిధిలోని జూపాడుబంగ్లా, మిడుతూరు. పగిడ్యాల, నందికొట్కూరు మండలాల పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు

మధ్యంతర భృతి ఇవ్వాలి

పాములపాడు: ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు దామరేకుల రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ కార్యాలయం వద్ద పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎంఈఓ బాలాజీనాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు వెంకటసుబ్బయ్య, నాగమయ్య, నాగశ్రీనివాసులు, దాక్షాయినిబాయి తదితరులు పాల్గొన్నారు.



పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

పింఛన్‌ల వడబోతకు రంగం సిద్ధం

పగిడ్యాల: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పింఛన్‌ల వడబోతకు రంగం సిద్ధం చేసింది. అధికారంలోకి రాక ముందు వృద్ధాప్య, వితంతు, కల్లుగీత, డప్పు కళాకారులకు నెలకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వడంతోపాటు బీసీ కులాల వారికి 50 ఏళ్లకే కొత్త పింఛన్‌లు మంజూరు చేస్తామని అధికారంలోకి వచ్చిన నాయకులు.. కొత్త పింఛన్‌లు మంజూరు చేయకపోగా ఉన్న వాటికి కొర్రీలు పెడుతున్నారు. నెలనెలా పింఛన్‌ల పంపిణీ ప్రభుత్వానికి భారంగా మారడంతో వడబోతకు శ్రీకారం చుట్టారు. పూర్తి స్థాయి వైకల్యం ఉండి రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారి వివరాలపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. అందులో భాగంగా పది మందితో కూడిన జాబితా తన కార్యాలయానికి అందిందని ఎంపీడీఓ సుమిత్రమ్మ సోమవారం తెలిపారు. డాక్టర్స్ టీమ్ పర్యవేక్షణలో వీటిపై విచారణ ఉంటుందన్నారు.

తుది ఓటర్ల జాబితా ప్రదర్శన


ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను తహసీల్దార్ రత్నరాధిక సోమవారం తన కార్యాలయలంఓ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో పురుషులు 30,883 మంది, మహిళలు 32,344, థర్డ్ జెండర్స్ 23 మంది, బండి ఆత్మకూరు మండలంలో పురుషులు 18,609, మహిళలు 19,524, థర్డ్ జెండర్స్ 5, మహానంది మండలంలో పురుషులు 14,540 మంది, మహిళలు 15,303 మంది, థర్డ్ జెండర్స్ 4, శ్రీశైలం మండలంలో పురుషులు 11,293 మంది, మహిళలు 11,602 మంది, థర్డ్ జెండర్స్ 4, వెలుగోడు మండలంలో పురుషులు 20,635 మంది, మహిళలు 21,820 మంది, థర్డ్ జెండర్స్ 2, మొత్తం నియోజకవర్గంలో ఓటర్లు 1,96,597 మంది ఉన్నారన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు వేణు కిరణ్, సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్, బీయస్పీ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

తుది ఓటరు జాబితా విడుదల

నందికొట్కూరు: స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటరు జాబితాను విడుదల చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల సమక్షంలో తహసీల్దార్ తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పురుషులు 1,06,873, స్త్రీలు 1,11,609, ఇతరులు 21 మంది కలిపి మొత్తం 2,18,503 మంది ఓటర్లు ఉన్నారన్నారు.



ఓటరు జాబితా విడుదల చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, నాయకులు

ఇస్తెమాకు తరలిరండి

బండి ఆత్మకూరు: ఆత్మకూరులో మంగళ, బుధ, గురువారాలలో నిర్వహించే ఇస్తెమాకు ముస్లింలు తరలిరావాలని ముఫ్తీ నూర్ మహమ్మద్ ఒక ప్రకటనలో కోరారు. ప్రార్థనా ప్రాంగణంలో ఒక్కో ప్రాంతానికి ఒక నంబర్ పాయింట్ కేటాయించారని, అందులో భాగంగా బండిఆత్మకూరు మండలం నుంచి హాజరయ్యే ముస్లిం సోదరులకు హల్ఖ-ఎ-అన్సార్ పేరుతో 50వ నంబర్ పాయింట్ కేటాయించారన్నారు.

పింఛన్లపై విచారణ

కొత్తపల్లి: పూర్తి అంగవైకల్యంతో మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు అందుతున్న పింఛన్లపై సోమవారం వైద్యాధికారులు విచారణ చేపట్టారు. కళ్యాణదుర్గం డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అనంతరపురం ప్రభుత్వాస్పత్రి డాక్టర్ నాగర్జున రెడ్డితో పాటు మండలంలోని గోకవరం ఆరోగ్యం కేంద్రం వైద్యుడు విజయేంద్ర గువ్వలకుంట్ల, జి.వీరాపురం, కొత్తపల్లి, ఎదురుపాడు గ్రామాల్లో లబ్ధిదారులను కలిసి శారీరక పరీక్షలు నిర్వహించారు. నిజంగానే అంగవైకల్యంతో బాధపడుతున్నారా, లేదా అనే విషయాలను సేకరించామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు. వారి వెంట హెల్త్ సూపర్‌వైజర్ గుర్రప్ప, ఏఎన్‌ఎం సరిత తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తుల ప్రదర్శన

వెలుగోడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను సోమవారం ఏఓ పవన్ కుమార్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గుంతకందాల, వేల్పనూరు గ్రామ రైతులు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది పెద్ద శివన్న, శీలం వెంకటేశ్వర్లు తదితరులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన కూరగాయలు ఆహార ఉత్పత్తులు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రసాయన రహిత ఆహార ఉత్పత్తుల వినియోగంతో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను తగ్గించి, ఆరోగ్యం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఈఓఆర్‌డీ మురారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోమల వినోలియా, ఎంఈఓ నాగబ్రహ్మయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నజీర్, శ్రీనివాసులు, కృష్ణస్వామి, శివమ్మ రామయ్య, తులసమ్మ పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

మహానంది: నంద్యాలలో పనిముగించుకుని స్కూటర్‌పై ఇంటికి వస్తుండగా ఎదురుగా ట్రాక్టర్ ఢీకొనడంతో దమాల పాములేటికి గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. తిమ్మాపురం గ్రామానికి చెందిన పాములేటి ఇంటికి వచ్చే క్రమంలో బుక్కాపురం వద్ద ఉన్న చెరువు అలుగుల వద్ద వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. గాయపడిన ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలి మృతి

మిడుతూరు: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గుంటిపోగు శామలమ్మ(37) మృతిచెందినట్లు వెలుగు ఏపీఎం సుబ్బయ్య సోమవారం తెలిపారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన శామలమ్మ గ్రామ, మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పనిచేస్తోంది. అనారోగ్యంతో ఐదు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న మండల సమాఖ్య కమిటీ సభ్యులు, వెలుగు ఏపీఎం, సీసీలు, వీఓఏలు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

25 మంది దివ్యాంగుల పింఛన్లు తనిఖీ

జూపాడుబంగ్లా: మండలంలోని పది గ్రామాల్లోని 25 మంది దివ్యాంగుల పింఛన్ల పై పరిశీలన చేయనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జూపాడుబంగ్లాలో 7, పారుమంచాల 6, మండ్లెం 5, తర్తూరు, తరిగోపుల గ్రామాల్లో రెండు చొప్పున, తాటిపాడు, తూడిచెర్ల, 80బన్నూరు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున దివ్యాంగుల పింఛన్లు పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు, సచివాలయ ఉద్యోగులు దివ్యాంగుల ఇళ్లవద్దకు వెళ్లి వారికిచ్చిన సదరం క్యాంపు సర్టిఫికెట్‌లో ఉన్న వికలత్వ శాతం, సదరం క్యాంపు సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ముందస్తుగానే వారికి సమాచారం ఇచ్చి వారి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. అందుకు గ్రామాల్లోని దివ్యాంగులు సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం

పాములపాడు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలమని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది రోగాలబారిన పడటానికి కారణం రోజూ తీసుకుంటున్న ఆహారమేనన్నారు. ఆకుకూరలు, కూరగాయలు ఎంత ఎక్కువ తీసుకుంటే అంత మంచిదన్నారు. అయితే అధిక దిగుబడుల కోసం రైతులు అధిక మోతాదుల్లో రసాయనిక ఎరువులు వాడటం, క్రిమిసంహారక మందులు పిచికారీ చేయటం వల్ల ఆహారం కలుషితం అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయపద్ధతులు పాటిస్తూ ఆహార పదార్థాలు ఉత్పత్తిచేయటం వల్ల స్వచ్ఛమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏపీఎం ఉమామహేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చక్రవర్తినాయక్, జనార్ధన్, పుష్పలత, అలీంసుల్తానా పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

వలసలు నివారించండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏపీడీ, ఎంపీడీఓలు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఉపాధికూలీలు వలసలు వెళ్లకుండా నివారించేలా ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు పనిచేయకపోతే సహించేది లేదని ఆత్మకూరు ఏపీడీ అన్వరాబేగం, ఎంపీడీఓ మేరి హెచ్చరించారు. సోమవారం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో సమీక్షాసమావేశాన్ని ఏపీఓ హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ, ఎంపీడీఓలు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి వలసలు నివారించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు కూడా గ్రామాలకు వెళ్లి కూలీలకు అవగాహన కల్పించి వలసలు వెళ్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఏ ఒక్కరు కూడా పనులు కల్పించడంలో జాప్యం వహిస్తే అటువంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కూలీల సంఖ్య కూడా పెంచే బాధ్యత ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ తీసుకోవాలని తెలిపారు.ఏగ్రామం నుంచి ఏకూలీ పని లేదని వలసవెళ్లకుండా చేయాలని సూచించారు. పనులు కల్పించలేమనే వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలని హెచ్చరించారు. ఇచ్చిన టార్గెట్లను ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ అధిగమించాలని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, టెన్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు గ్రామానికి చెందిన చిన్న ముంతల శిరోమణి కి సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఆమె అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స చేయించుకొంది. సీఎంఆర్‌ఎఫ్ కు దరఖాస్తు చేసుకోగా ఆమెకు ప్రభుత్వం రూ.81వేల చెక్కును మంజూరు చేసింది. ఈ చెక్కును ఎమ్మెల్యే జయసూర్య చేతులమీదుగా బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఎం అంబమ్మ, మాండ్రసురేంద్రనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, మోహన్‌రెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

9న మౌలాలిస్వామికి నియాజ్

మహానంది: గాజులపల్లెలో కొలువై మహిమాన్వితుడిగా ప్రసిద్ధి చెందిన హజరత్ సయ్యద్ మౌలాలి స్వామివారికి ఈనెల 9న నియాజ్(కందూరి)మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు.

గాజులపల్లెలో ఘర్షణ

- తండ్రి, కుమారుడికి కత్తిపోట్లు
- స్థలం విషయంలో గొడవ

మహానంది: ఇంటి పక్కన స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. గాజులపల్లెలో సోమవారం రాత్రి ఈఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన చింతల వెంకటసుబ్బయ్య ఇంటి పక్కన స్థలం విషయంలో మరో వర్గానికి చెందిన మునిశేఖర్, రమేష్, మునేష్ మధ్య వివాదం నెలకొంది. దీంతో వారి మధ్య ఘర్షణ జరగగా ముగ్గురితో పాటు మరో ఇద్దరు చింతల వెంకటసుబ్బయ్యపై దాడి చేశారు. ఆ సమయంలో అడ్డొచ్చిన కుమారుడు మనోజ్‌పై కూడా కత్తులతో దాడి చేశారు. దీంతో తండ్రికి, కుమారుడికి రక్త గాయాలైనట్లు పోలీసులు చెప్పారు. తండ్రి చింతల వెంకటసుబ్బయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు.



గాయపడిన చింతల వెంకటసుబ్బయ్య, మనోజ్

నేడు ప్రారంభోత్సవం

నంద్యాల(అర్బన్): స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటైన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ప్రారంభించనున్నారు. ఉద యం 8.30 గంటలకు ప్రారంభోత్సవ ముహూర్తం నిర్ణయించారు. డీఆర్ఓ రామునాయక్, ఆర్‌డీఓ విశ్వనాథ్, పలు శాఖల అధికారులు హాజరయ్యే కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రామచంద్రారావుకు ఎఫ్ఏసీతో రూరల్ తహసీల్దార్‌గా నియమించనున్నట్లు సమాచారం.

శ్మశానానికి దారి చూపండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంబేద్కర్ సేన నాయకులు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో శ్మశానం ఆక్రమణలకు గురవుతుందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సేన జిల్లా కన్వీనర్ సుధాకర్, శ్రీనివాసులు, రాజు, దినేష్, అనిల్, చిరంజీవి, రోషయ్య సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. 617 సర్వే నంబరులో రెండు ఎకరాల శ్మశాన వాటికను గోపవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని బోరు ఏర్పాటు చేసి మరొకరికి విక్రయించాడని ఫిర్యాదు చేశారు.